ఎల్లారెడ్డిపేట: మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జడ్పీటీసీ, నాయకులు

గంభీరావుపేట : కేసీఆర్‌తో జడ్పీటీసీ విజయ దంపతులు

# కేసీఆర్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/వీర్నపల్లి , జూన్ 27: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు మండల నాయకులు గురువారం ఎర్రవెల్లిలో కలిశారు. ధైర్యంగా ఉండాలని ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ఇక్కడ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, తదితరులున్నారు. కేసీఆర్‌ను జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ-లక్ష్మణ్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఐదేళ్లలో చేసిన మండల అభివృద్ధిని వివరించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కేసీఆర్‌ను వీర్నపల్లి మండల జడ్పీటీసీ గుగులోత్ కళావతి, సురేశ్‌నాయక్ దంపతులు, జడ్పీ కో ఆప్షన్ చాంద్‌పాషా మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు. అదే విధంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

**కేటీఆర్‌ను కలిసిన ఎల్లం**

ముస్తాబాద్, జూన్ 27 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకుడు తాడెపు ఎల్లం మర్యాద పూర్వకంగా కలిశారు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి మాజీ సర్పంచ్ తాడెపు జ్యోతి భర్త బీఆర్ఎస్ నాయకుడు తాడెపు ఎల్లం గురువారం కేటీఆర్‌ను కలిసి ఐదేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కొన్ని సమస్యలు ఆయన దృష్టికి తీసువచ్చినట్లు ఎల్లం తెలిపారు.

కేసీఆర్‌తో జడ్పీటీసీ కళావతి దంపతులు

కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు ఎల్లం

# పంటల సాగుకు సహకరించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పలు శాఖలపై సమీక్ష

కలెక్టరేట్, జూన్ 27 : ప్రణాళిక ప్రకారం పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. ఈ మేరకు గురువారం సమీకృత కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ సన్నద్ధతపై బ్యాంకర్లతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణం, పంటల సాగు, ముఖ్యమైన పంటలు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సహకారం, ఎరువులు, విత్తనాల లభ్యత, పంటలకు నీటి లభ్యత, రైతు భరోసా, రైతు బీమా, మెకనైజేషన్, రైతు వేదికలు, రైతు నేస్తం వంటి వివిధ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ, ఖరీఫ్ పంట సాగు సజావుగా నిర్వహించేందుకు రైతులకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. క్రాప్ బుకింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలని సూచించారు. రైతు భరోసా పథకం అమలుపై ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందని, క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి భాస్కర్, ఎల్‌డీఎం మల్లికార్జున్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

**రైతు రుణమాఫీ సజావుగా జరగాలి**

జిల్లాలో రైతు రుణమాఫీ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ సన్నద్ధతపై బ్యాంకర్లతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో జరిగిన రుణమాఫీ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 61,343 రైతులుండగా ఇందులో 40,567 మంది రైతులకు రూ.240 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని, 10వేల 756 మంది రైతులకు ప్రాసెస్‌లో ఉందని, మిగిలినవి వివిధ సాంకేతికత, తదితర కారణాల వలన రుణమాఫీ జరుగలేదని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ఇక్కడ లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, డీఏవో భాస్కర్, అధికారులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి**

సీఎంఆర్ లక్ష్యం ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాల శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లులకు రోజువారీ లక్ష్యాలు నిర్ణయించి, సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ రైస్ మిల్లు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయో గుర్తించాలని, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ జితేంద్రప్రసాద్ తదితరులున్నారు. అలాగే, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో డీఆర్డీవో శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మహిళా శక్తిలో భాగంగా జిల్లాలోని 31 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు స్కూల్ విద్యార్థులకు 34,387 యూనిఫాంలు కుట్టించి పంపిణీ చేశామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎంత మందికి ఉపాధి కల్పించారని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, పీఎంఎఫ్‌ఎంఈ పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్‌లున్నారు.

**వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి**

బోయినపల్లి, జూన్ 27: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గురువారం ఉదయం బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, ఆయుష్ వైద్యుడు, ఫార్మసిస్ట్ ఒక్కరే విధులకు హాజరు కాగా వైద్యురాలు, వైద్య సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం దవాఖాన పరిసరాలను పరిశీలించారు.

# వెరీ గుడ్.. దేశాయిపల్లె పంచాయతీ..!

- వంద శాతం ఇంటి పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచిన గ్రామస్తులు
- కార్యదర్శి, కారోబార్‌ను సన్మానించిన ఎంపీడీవో

కార్యదర్శి స్రవంతి,కారోబార్ హరీశ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో రాజు

సిరిసిల్ల రూరల్, జూన్ 27: తంగళ్లపల్లి మండలంలోని దేశాయిపల్లె గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలిచింది. 2024-25 సంవత్సర ఇంటిపన్నులతోపాటు ఇతర పన్నులను వందశాతం చెల్లించారు. 2018 సెక్షన్ 67 ప్రకా రం మూడు నెలల్లో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయడం గమనార్హం. ఇందుకు కృషి చేసిన కార్యదర్శి కొక్కుల స్రవంతి, కారోబార్ హరీశ్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జోగం రాజు అభినందించారు. ఈసందర్భంగా గురువారం కార్యదర్శి స్రవంతి, కారోబార్ హరీశ్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించి సత్కరించారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులు అయిల్ల శ్రీనివాస్, రాపెల్లి శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూన్ 27: భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)సిరిసిల్ల శాఖ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్సు కార్పొరేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అయిల్ల శ్రీనివాస్, కార్యదర్శిగా రాపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా గంప ప్రణీత్, అరవెల్లి ప్రణయ్, కోశాధికారిగా మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా ఎస్ కిరణ్, ఆర్ సాయిచంద్రప్రకాశ్, వీ కావ్య, పీ భూమయ్య, జీసీఎంగా నాయిని దినకర్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కరీంనగర్ డివిజన్ యూనియన్ కార్యదర్శి వామన్‌రావు, ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు అభినందించారు.

# కోడెలకు ఆరోగ్య పరీక్షలు

కోడెలకు వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేములవాడ టౌన్, జూన్ 27 : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హనుమంతరావు ఆదేశాల మేరకు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సూచనల మేరకు గురువారం తిప్పాపురంలోని రాజన్న ఆలయ గోశాలలోని కోడెలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది డాక్టర్లు, 10 మంది సిబ్బంది గోశాలలోని 1500 కోడెలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనారోగ్యంగా ఉన్న కోడెలకు వ్యాక్సిన్లు, మందులు వేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు నాగుల మహేశ్ తదితరులున్నారు.

# పాఠశాలకు సాయం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి రమేశ్
- జడ్పీ పాఠశాలలో శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

కొదురుపాక జడ్పీ పాఠశాలలో శుద్ధి జలాల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డీఈవో రమేశ్

బోయినపల్లి, జూన్ 27:చదువుకున్న పాఠశాలకు సాయం చేయడం అభినందనీయని, ప్రతి విద్యార్థీ బీసీఎం వ్యవస్థాపకుడు డా.వైరాగ్యం రాజలింగంను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. కొదురుపాక గ్రామానికి చెందిన, పూర్వ విద్యార్థి డా.వైరాగ్యం రాజలింగం తనతల్లిదండ్రులు వైరాగ్యం బుచ్చమ్మ, చంద్రమౌళి పేరిట పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన శుద్ధ జలప్లాంట్ (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్)ను డీఈవో రమేశ్, ఉపాధ్యాయులు, డా.రాజలింగం గురువారం ప్రారంభించారు. అనంతరం డా.రాజలింగంను మెమెంటోతో ఘనంగా సన్మానించారు. డీఈవో రమేశ్ మాట్లాడుతూ, కంటి వైద్య నిపుణుడు రాజలింగం చదువు చెప్పిన పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. రాజలింగం మాట్లాడుతూ, ఇక్కడ చదువుకుని ఇప్పుడు ఇంత పెద్దస్థాయిలో ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది నుంచి తన తల్లిదండ్రుల పేరిట పదోతరగతి టాపర్‌కు అరతులం బంగారం, రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచ్ రవిచందర్, హెచ్‌ఎం ఉషారాణి, బీసీఎం వైద్యురాలు అనూషరెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

# కమనీయం వేణుగోపాలస్వామి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, జూన్ 27 : రాజన్న అనుబంధ వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు కమనీయంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రతాప శ్రీనివాస్, దుమాల నాగరాజు, గోపన్నగారి శివప్రసాద్, గణేశ్, వేణు, చందు, వేణుగోపాల స్వామివారి ఆలయ అర్చకులు రాచకొండ భాను, మరగంటి గిరిధరాచార్యులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణంలో బూరుగడ్డ కిరణ్ దంపతులు ఆచార్యదంపతులుగా వ్యవహరించారు. అర్చకులు వేదమంత్రాల మధ్య రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారిని మంగళవాయిద్యాల మధ్య మండపానికి తీసుకువచ్చి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం అర్చకులు పూర్ణాహుతి నిర్వహించారు. ఇక్కడ ఆలయ ఏఈవో సంకేపల్లి హరికిషన్, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ పూజల ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్ రెడ్డి, గట్టు గౌతమ్ భక్తులున్నారు.

# నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, జూన్ 27: దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహితపై పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుంటుందన్నారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ చూపిన 22 మంది పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సర్వర్, సీఐలు, ఎస్ఐలున్నారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా కూరగాయల అనిత, W/o. మల్లేశం, R/o. మోచివాడ, వేములవాడ టౌన్ & మం॥, రాజన్న సిరిసిల్ల జిల్లా గారు మార్టిగేజ్ లోను నిమిత్తము రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సర్వే నెం. 1369, విస్తీర్ణం 366.50 చ.గ.లలో గల RCC ఇల్లు నెం. 7-5-126/2/A/1 గల దానిని "HDFC BANK LTD" వేములవాడ బ్రాంచ్ వారికి తనఖా పెట్టుటకు దరఖాస్తు సమర్పించియున్నారు. లోగడ కూరగాయల అనిత గారు ఇట్టి ఇంటి ప్లాటును అనుమల్ల వేను, S/o. భూమయ్య, R/o. భవానినగర్, వేములవాడ టౌన్, రాజన్న సిరిసిల్ల జిల్లా గారి నుండి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 6276/2018 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం. 905/2001 గల దస్తావేజు పోయినదని కూరగాయల అనిత గారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజుపై గాని లేదా పై ప్రాపర్టీపై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల వ్రాతపూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో "HDFC BANK LTD" వేములవాడ బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సం/- సాన చంద్రమోహన్ అడ్వకేట్
(TS/138/1995) ప్లాట్ నెం.303, శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్. సెల్: 9666077777, 9141499999.

# ఉపాధి కల్పించాలి

కలెక్టరేట్, జూన్ 27 : ఉపాధి లేక అల్లాడుతున్న గార్మెంట్ కార్మికులకు తక్షణమే పని కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. గురువారం సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం గార్మెంట్ రంగంలో పనిలేక ఇబ్బంది పడుతున్న వర్కర్స్ వేల మందికి పనికల్పించాలన్నారు. గార్మెంట్ రంగంలో ప్రస్తుతం రెండు వందల మందికే అపెరల్ పార్క్‌లో పని ఉందన్నారు. మిగతా కార్మికులకు కూడా పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1న కలెక్టర్ వద్ద నిర్వహించే ధర్నాలో గార్మెంట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని గార్మెంట్ యూనియన్ తరపున యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం కమలాకర్ కోరారు.

# శ్రీకుక్కే సుబ్రమణ్యస్వామివారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 27 : కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకుక్కే సుబ్రమణ్యస్వామి వారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

# ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు తప్పిన ప్రాణాపాయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డికి ప్రాణాపాయం తప్పింది. గురువారం రింగ్ రోడ్డు నుంచి వెళ్తుండగా ఎదురుగా ఉన్న లారీని ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఉన్న వెంకట్‌రెడ్డి పెద్ద ప్రమాదం నుంచి బయటపడగా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన ప్రమాదంపై వెంకట్‌రెడ్డిని ఫోన్ ద్వారా పరామర్శించారు.

# అభివృద్ధి పనులకు భూమిపూజ

వేములవాడ రూరల్, జూన్ 27: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలోని శివాలయం, క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులకు గురువారం ఎంపీపీ బండ మల్లేశం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మండల పరిషత్ నిధుల నుంచి శివాలయ అభివృద్ధి పనులతో పాటు క్రికెట్ గౌండ్ నిర్మాణానికి రూ.3 లక్షలను కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రగిరి రాజు, చింతలకోటి రవిరాజు, లక్కం తిరుపతి, గుమ్మడి శ్రీనివాస్, రవికిశోర్, రాజేశం, సత్తయ్య, అశోక్, పరుశరాములున్నారు.

# ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: వెంకటాపూర్ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. గురువారం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు వెంకటాపూర్ శివారుల పట్టుకుని ఠాణాకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు బత్తుల దీపక్, గుడికందుల విజయ్‌భాస్కర్‌రెడ్డి, యజమానులు పాండవుల దుర్గయ్య, గెంటె సంతోష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# మెరుగైన సేవలందించాలి

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట: కోరుట్లపేట-బొప్పాపూర్ శివారులో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న కొండూరి రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: వాహనదారులకు మెరుగైన సేవలందించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. గురువారం కోరుట్లపేట-బొప్పాపూర్‌లో ఎల్లారెడ్డిపేట ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత్ పెట్రోలు పంపు ను ప్రారంభించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, డైరెక్టర్లు నేవూరి వెంకటనర్సింహారెడ్డి, ల్యాగల సతీశ్‌రెడ్డి, దొమ్మాటి నర్సయ్య, గంద్ర ప్రభాకర్‌రావు, గోగూరి ప్రభాకర్‌రెడ్డి ఎంపీటీసీలు సింగారపు మధు, ఇల్లెందుల గీతాంజలి, ఎన్గందుల అనసూయ, నాయకులు కుంబాల మల్లారెడ్డి, కొండ రమేశ్‌గౌడ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి తదితరులున్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో సీఈవో రాజిరెడ్డి, సలహాదారు పురం సత్యంరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, నేతలు వంగ సురేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, రత్నాకర్, వహీద్, కిషోర్, బ్యాంకు సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులున్నారు.

**బాధిత కుటుంబాలకు బీమా అండ**

గంభీరావుపేట, జూన్ 27: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. మండలంలోని పంతం సుమన్, గుండ్ల శ్రీనివాస్, ఆవునూరి దేవయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు మంజూరైన బీమా చెక్కులను కొండూరి అందించారు. కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఖాతాదారులు పీఎమ్‌జేజేవై పథకం ప్రీమియం చెల్లించి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు బీమా అందుతుందని కొండూరి తెలిపారు.

**పరామర్శ**

గంభీరావుపేట, జూన్ 27: మండలంలోని ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలను గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. గోరంటాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని, సముద్రలింగాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు మల్లవరం సదాశివరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని కొండూరి పరామర్శించారు. వీరితో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎర్ర రామాంజగౌడ్, ఎంపీటీసీ ఎర్రం అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ మోతె రాజిరెడ్డి, నేతలు రాగుల అంజిరెడ్డి, కామిడి సదాశివ రెడ్డి, కమ్మరి రాజారాం, దేవరెడ్డి, మహేశ్ యాదవ్, ఎల్లాగౌడ్, జంగంపల్లి శేఖర్‌గౌడ్‌లున్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

వేములవాడ రూరల్, జూన్ 27: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి, ఎదురుగట్ల గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా లింగంపల్లికి చెందిన సామ శివారెడ్డి, ఎదురుగట్లలో చంద్రగిరి అంజయ్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు తిరుపతిరెడ్డి, నేదూరి శ్రీనివాస్, మహేశ్ గౌడ్, మల్లారెడ్డి, రాంరెడ్డి, నర్సారెడ్డి, రాజు, అంజిమొద్దీన్, నాగరాజు, శ్రీనివాస్, హరీశ్, వంశీ, వెంకటేశ్ ఉన్నారు.

# నాణ్యమైన విద్యుత్ లక్ష్యం

ముస్తాబాద్ జూన్ 27 : రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక నాయకులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిప్పలపల్లిలో కొందరు రైతుల విన్నపం మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో చిప్పలపల్లి మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముట రాయమల్లు, ప్యాక్స్ డైరెక్టర్ గాడిచెర్ల రామచంద్రం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాచెట్టి లక్ష్మణ్, నాయకులు చిలివేరి స్వామి, మాధవరెడ్డి, సెస్ గ్రామ ప్రతినిధి పొన్నాల లింగం, సుమన్, దేవయ్య, శ్రీనివాస్, రమేశ్, శంకర్, బాల్‌రెడ్డి, నరసింహులు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

వేములవాడ, జూన్ 27: వేములవాడ పట్టణంలో కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విధులు ముగించుకొని బయటకు వస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి సునీతపై దాడి చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ ముందున్న హోంగార్డ్ బాబాయ్‌పై కూడా దాడి చేసింది. అలాగే విశ్వబ్రాహ్మణ వీధిలోని శరత్ చంద్ర అనే పది సంవత్సరాల బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మరొకరిపై కూడా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారందరూ వేములవాడ ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స తీసుకోగా, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ చేరుకొని బాధితులను పరామర్శించారు. దాడి చేసిన కుక్కలను వెంటనే పట్టుకునేందుకు మున్సిపల్ అధికారులు సమాచారం అందించారు.

# వేములవాడలో భారీ వర్షం

వేములవాడ రూరల్: హన్మాజీపేట మూలవాగు ప్రవాహంతో తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో నిలిచిన రాకపోకలు

వేములవాడ/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట, జూన్ 27: వేములవాడ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పంట పొలాలకు కొంత ఊరట కలిగింది. వేములవాడ పట్టణంలో 4.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు గణాంక అధికారి వెంకటరమణ తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని బుధవారం రాత్రి కురిసిన వర్షానికి హన్మాజీపేట నక్కవాగు పొంగింది. దాదాపు 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హన్మాజీపేట నక్కవాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండగా తాత్కాలికంగా రోడ్డును వేశారు. నక్కవాగు ప్రవాహంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వేములవాడ వచ్చే వాహనదారులు లింగంపల్లి, మారుపాక మీదుగా వచ్చారు. తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేపడితే రాకపోకలు సాగే అవకాశం ఉంది. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రైతులు విత్తనాలు మొలక మంచిగా వస్తాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఇల్లంతకుంట, జూన్ 27 : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసి మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఇక్కడ కేజీబీవీ స్పెషల్ అధికారి శిరీష, ఉపాధ్యాయులు,విద్యార్థులున్నారు.

# యార్న్ సబ్సిడీని విడుదల చేయాలి

- సీఐటీయూ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ
- కమిషనర్ హామీతో నేతన్న దీక్ష వాయిదా

కలెక్టరేట్, జూన్ 27: పవర్‌లూం కార్మికులకు బతుకమ్మ చీరెలకు సంబంధించిన 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలోని చేనేత జౌళిశాఖ ఆఫీసు ఎదుట పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నేతన్న దీక్షకు హాజరై మాట్లాడారు. ఇటీవలే రాష్ట్ర చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన శైలజా రామయ్యార్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులకు ఫోన్ చేసి 2022కు సంబంధించిన బతుకమ్మ చీరెల 10 శాతం యార్న్ సబ్సిడీని రిలీజ్ చేశామని, రెండు, మూడు రోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారని వెల్లడించారు. ఆమె హామీ మేరకు దీక్షను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించామని తెలిపారు. కాగా జౌళిశాఖ డీవో అజార్‌కు వినతిపత్రం అందించామన్నారు. 2023వ సంవత్సర యార్న్ సబ్సిడీని కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నేతన్నల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 7నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నేతన్న పోరుయాత్ర చేపడతామన్నారు. సిరిసిల్లలో ప్రారంభమయ్యే యాత్రలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, సిరిమల్ల సత్యం, కంది మల్లేశం, చంద్రకాంత్, సురేశ్, శంకర్, సత్యం, పోచమల్లు, రాజమౌళి, గణేశ్, విజయ్, రవి, శ్రీనివాస్, శేఖర్ ఉన్నారు.

# పాల డెయిరీ గ్రామాధ్యక్షుడిగా కనకయ్య

పెద్దలింగాపూర్ గ్రామంలో పాల కేంద్రం నూతన కార్యవర్గ సభ్యులు

ఇల్లంతకుంట, జూన్ 27 : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ కరీంనగర్ పాల డెయిరీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. నూతన అధ్యక్షుడిగా పయ్యావుల కనకయ్య, డైరెక్టర్లుగా చిట్యాల శంకర్, జంగిటి తిరుపతి, ల్యాగల సంపత్, ఎండి రంజాన్, ఆసిల్ల రాజయ్య, కేతిరెడ్డి రమేశ్ రెడ్డి, కోలాపూరం సుశీల, కడారి భాగ్యను ఎన్నుకున్నారు.

# సంస్కృత కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

శాసనాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకుడు తిరుపతి

వేములవాడ టౌన్, జూన్ 27: వేములవాడ శ్రీరాజరాజేశ్వర సంస్కృత కళాశాలలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థులు గురువారం వేములవాడలో క్షేత్ర పర్యటన చేశారు. విద్యార్థులు రాజన్న ఆలయం, బద్దిపోచమ్మ, శ్రీ భీమేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కేదారేశ్వరాలయాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల మల్లారెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు వేములవాడ క్షేత్ర మహాత్మ్యం, చరిత్ర, దేవాలయాల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఇక్కడ చరిత్ర అధ్యాపకులు సందెవేని తిరుపతి, డాక్టర్ చందప్రకాశ్, శిరీష, విద్యార్థులున్నారు.

# లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గంభీరావుపేట, జూన్ 27: మండల లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లపు నర్సింలు, ఉపాధ్యక్షులుగా మూల రాజిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా సయ్యద్ సాదిక్, ప్రధాన కార్యదర్శిగా వహీద్, కోశాధికారిగా పల్లపు నరేశ్, కార్యదర్శులుగా చల్ల వెంకటేశ్, సతీశ్, కార్యవర్గ సభ్యులుగా పల్లపు నర్సింలు, దేవయ్య, పెద్ద నర్సింలు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.